# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి:15 సంచిక:6 జులై :2026 వెల: రూ5/-






## జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వ సానుకూల వైఖరి

## జర్నలిస్టులకు తప్పనిసరిగా ఇంటిస్థలాలు



ప్రబీర్ పురకాయస్థ నిర్దోషి



నూతనంగా ఎన్నికైన
ఎన్టీఆర్ జిల్లా ఫెడరేషన్,
ఎపిబిజెఎ నాయకులు
మైలవరం శాసనసభ్యులు
వసంత కృష్ణప్రసాద్‌ను
కలిసిన దృశ్యం

అనంతపురం జిల్లాలోని జర్నలిస్టుల
పిల్లలకు కార్పొరేట్, ప్రైవేటు
విద్యాసంస్థలో ఉచిత విద్యావసతి
కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం
సమర్పించిన ఫెడరేషన్ ప్రతినిధులు





అనంతపురం జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు
ఉచితంగా నోట్ పుస్తకాల సెట్‌ను ఫెడరేషన్
ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో జరిగిన
కార్యక్రమంలో పంపిణీ చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం జిల్లాలోని
జర్నలిస్టుల పిల్లలకు
ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు
రాయితీ కల్పించాలని
కోరుతూ జిల్లా కలెక్టర్‌కు
వినతిపత్రం అందజేసిన
ఫెడరేషన్ ప్రతినిధులు



# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 15 జులై 2026 సంచిక: 6**


## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| ప్రభీర్ పురకాయస్థ నిర్దోషి ......... | 4 |
| జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ ......... | 5 |
| వ్యవస్థలు తలకిందులైతే ................ | 6 |
| జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి రక్షణే ధ్యేయం ........................ | 7 |
| కళను కుంచెతో సాయుధం చేసినవాడు! ............ | 9 |
| రెడ్డిగూడెం జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాల పంపిణీ ................ | 11 |
| సమాచార శాఖలో ప్రమోషన్లు ....................... | 12 |
| సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులంతా ....... | 13 |
| యుపిఐతో పిఎఫ్ విత్‌డ్రా ----- | 14 |
| కర్నూలు కలెక్టరుకు ఫెడరేషన్ వినతి ..................... | 15 |
| సహకార భూమికి ఆబ్కాబ్ తోడ్పాటుకు నిర్ణయం ....... | 17 |
| పుట్టపర్తి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక ...... | 21 |



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| వి.భక్తవత్సలం | ఒ.శాంతి |
| ఎస్.మురళీశంకర్ | కె.ఎస్.శంకరరావు |
| జి. శీనుబాబు | డి.మధుసూదనరావు |

**డిప్యూటీ ఎడిటర్: జిలాని ఎస్.ఎం**

**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.


**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


## వృత్తి ధర్మానికి దక్కిన ప్రతిఫలమిది!?

ఏడు నెలల జైలుశిక్ష, కోర్టు విచారణ అనంతరం సీనియర్ జర్నలిస్టు ప్రబీర్ పురకాయస్థ నేరస్తుడు కాదని తేల్చారు. విదేశీ నిధుల మళ్ళింపు పేరుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు బనాయించినా అసలు సమస్య అది కాదని స్పష్టమైంది. నిధులిచ్చిన అమెరికా కంపెనీ మోసం జరిగిందని ఫిర్యాదు చేయనప్పుడు ప్రబీర్‌పై పెట్టిన ఆరోపణల్లో అర్థం లేదని తెలిసిపోతోంది. ఇది కేవలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే వారిని భయపెట్టేందుకు మాత్రమే ఉద్దేశించింది. ప్రబీర్ పురకాయస్థ లాంటి పేరున్న జర్నలిస్టును ఇబ్బందుల పాల్జేస్తే ఆ బాటలో నడిచే మిగిలిన జర్నలిస్టులు భయపడి పోతారని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ఇప్పటికే అనేకమంది ఇండిపెండెంట్ జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించారు. ఐటి చట్టాన్ని అడ్డం పెట్టుకుని సమాచార హక్కు చట్టానికి ప్రభుత్వమే తూట్లు పొడుస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఐటి చట్టం కింద కేసులు బనాయిస్తున్నవారి సంఖ్య లెక్కకు మిక్కిలిగా ఉంది. ప్రభీర్ కేసు తీర్పు వెలువడిన అనంతరం మిగిలిన కేసుల్లో కూడా ఏమి బయటపడుతుందో ఇప్పుడే తెలిసిపోతోంది. విదేశీ నిధులు భారత గడ్డపై అడుగుపెట్టేందుకు అవసరమైన చట్టాలు చేసింది ప్రభుత్వం కాదా? అందులో వారి వాటా 28 శాతం నుంచి పెంచడానికి కారణం ఎవరు? విదేశీ నిధులను ఎక్కడికక్కడ కట్టడి చేసే అవకాశం ఎవరి చేతుల్లో ఉంది? ఆ రోజున్న పరిస్థితుల్లో విదేశీ మీడియాను ప్రోత్సహించి మొత్తం మీడియాను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలని ప్రయత్నించిందెవరు? ఆదాని, అంబానీలు మీడియా రంగంలో అడుగుపెట్టాక దాదాపు 90 శాతం పైగా మీడియాను నియంత్రిస్తున్నది వారు కాదా? అక్కడక్కడ ఇండిపెండెంట్ మీడియా తన గొంతు వినిపించేందుకు ప్రయత్నిస్తే నిర్దాక్షిణ్యంగా రకరకాల పద్ధతుల ద్వారా తొక్కి తమ అదుపులోకి తెచ్చుకుంటున్నదెవరు? ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మీడియా ఎదుగుదల ఎంత కష్టం? 1970 దశకంలో జాతీయ జర్నలిస్టు సంఘం అటువంటి ప్రయత్నం చేసింది. కొన్ని రాష్ట్రాల్లో పత్రికల స్థాపన జరిగింది. అవి కొంతకాలం విజయవంతంగా కూడా నడిచాయి. నాటి పరిస్థితిని, నేటి పరిస్థితికి హస్తిమశికాంతర భేదం ఉంది. అప్పట్లో జర్నలిస్టు సంఘాల ప్రయత్నానికి ఎంతో కొంత ప్రభుత్వ తోడ్పాటు లభించింది. దేశంలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తుల తోడ్పాటు వల్ల అది సాధ్యపడింది. ప్రస్తుతమున్న ఇంత ఒత్తిడి, దమనకాండల మధ్య ముందుకు సాగేందుకు ఎంతో శక్తి కావాలి. ఎందరో వ్యక్తులు, శక్తుల తోడ్పాటు అవసరం. జర్నలిస్టు వృత్తి విలువలను కాపాడేందుకు సాధ్యమైనంతగా ముందుకు సాగుతూ ఇలాంటి నిర్భంధాలను, అవమానాలను ఎదుర్కొవాలి.

# ప్రభీర్ పురకాయస్థ నిర్దోషి



పత్రికాస్వేచ్ఛను అణిచివేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం న్యూస్ క్లిక్ సంపాదకులు ప్రభీర్ పురకాయస్థపై మోపిన కేసులన్నీ అక్రమమేనని తేలిపోయింది. విదేశీ నిధుల వ్యవహారానికి సంబంధించి ఆయనపై ఢిల్లీ పోలీసులు ఆర్థిక నేరాల విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ నమోదు చేసిన కేసులను ఢిల్లీ హైకోర్టు కొట్టిపారేసింది. ఆయనను నిర్దోషిగా పేర్కొంటూ న్యాయమూర్తి నీనా బన్సల్ కృష్ణ సంచలన తీర్పును వెలువదించారు. ఈ కేసును కొనసాగించడం అంటే చట్టాలను ఘోరంగా దుర్వినియోగం చేయడమేనని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఐపిసి సెక్షన్‌లో 406 క్రిమినల్ బ్రీచ్ అఫ్ ట్రస్ట్, 420 మోసం కింద ఆయనపై మోపిన నేరాలు ఏవీ ఋజువు కాలేదని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) స్వాగతించింది.

**ఏం జరిగింది?**

2020 ఆగస్టులో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ న్యూస్ క్లిక్ ఆర్థిక వ్యవహారాలపై ఫిర్యాదు చేసింది. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదయింది. అనంతరం 2021 ఫిబ్రవరిలో న్యూస్‌క్లిక్ కార్యాలయాలు, సంపాదకుల నివాసాలపై ఐటి దాడులు నిర్వహించింది. అమెరికాకు చెందిన వరల్డ్ మీడియా హోల్డింగ్ ఎల్ఎల్సి సంస్థ నుంచి న్యూస్‌క్లిక్ 9.59 కోట్లు ఎఫ్‌డిఐ రూపంలో అందుకుందని షేర్లను అధిక విలువలో చూపించి నిబంధనలు ఉల్లంఘించారని, ఆ నిధులు జీతాలు కన్సల్టెన్సీ ఫీజులు పేరుతో మళ్ళించారని ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం కేసు నమోదు చేసి 23 నవంబర్ ప్రభీర్ పురకాయస్థను అరెస్టు చేసి తీహారు జైలుకు పంపింది. దీంతో ఆయన దాదాపు 7 నెలలకు పైగా జైలు శిక్షను అనుభవించారు. అయితే 2018 ఏప్రిల్‌లో పెట్టుబడి అందిన సమయానికి డిజిటల్ న్యూస్ మీడియాపై ఎఫ్‌డిఐలకు పరిమితి లేదని కోర్టు గుర్తించింది. సమాచార మంత్రిత్వ శాఖ జనవరి 2018లో జారీచేసిన స్పష్టీకరణ ఆధారంగా ఎలాంటి చట్ట ఉల్లంఘన జరగలేదని ధర్మసనం తేల్చి చెప్పింది. అంతేకాదు ఇది ఆర్థిక నిర్ణయం మాత్రమేనని ఏ నేరం జరగలేదని కోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాకుండా వరల్డ్ మీడియా హోల్డింగ్ ఎల్ఎల్సి సంస్థ మోసపోయామని ఎక్కడా ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. అందువల్ల సెక్షన్ 420 వర్తించదని కోర్టు పేర్కొంది. అలాగే నిధుల మళ్లింపు ఆరోపణను తోసిపుచ్చింది. అధిక చెల్లింపులు జరిగినాసరే అది నేరం కాదని, నిధుల మళ్లింపు ఆరోపణ సమర్థనీయం కాదని నేరం జరిగిందని చెప్పడానికి ఎలాంటి సాక్ష్యం లేదని కోర్టు స్పష్టం చేసింది.

ఇది దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి నిదర్శనం ప్రభీర్ పురకాయస్థపై కేసు కొట్టివేత పై నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు స్పందించింది. న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించింది. ఫాసిస్టు అబద్ధాలు ముక్కలైపోయాయని సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది. మోడీ ప్రభుత్వం జర్నలిస్టులను భయపెట్టడానికి, అసమ్మతిని అణిచివేయడానికి, పత్రికాస్వేచ్ఛను దెబ్బతీయడానికి మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను బరితెగించి దుర్వినియోగం చేస్తోందని, ప్రభీర్ కేసు అందుకు నిదర్శనం అని తెలిపింది. ఇందుకు ఢిల్లీ కోర్టు వెలువరించిన తీర్పు రుజువు అని పేర్కొంది.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పరిపాలనా కాలంలో గృహనిర్మాణ శాఖలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సవివరంగా చెప్పారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం గురించి జర్నలిస్టులు ప్రస్తావించగా ఆయన సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇంటిస్థలాల వ్యవహారం పరిశీలనలో ఉన్నదని చెప్పారు. దీనికోసం మంత్రివర్గ ఉపసంఘం వేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జర్నలిస్టుల పట్ల సానుకూలంగా ఉంటారని, వారి సమస్యలు ఆయన దృష్టిలో ఉన్నాయని అన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటిస్థలం కేటాయించేందుకు కృతనిశ్చయంతో ఉన్నదని ముందున్న అనేక సమస్యలను పరిష్కరిస్తూ జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకించి ఇంటి స్థలం కేటాయింపు వ్యవహారం ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు.




# జర్నలిస్టులకు తప్పనిసరిగా ఇంటిస్థలం కేటాయింపు

ఆంధ్రప్రదేశ్‌లోని జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటిస్థలం తప్పనిసరిగా కేటాయిస్తుందని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. రెండు సంవత్సరాల కూటమి పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సచివాలయంలో ఆయన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. సమాజ పురోభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర విస్మరించలేనిదని, వారి సేవలకు గుర్తింపుగా ఇంటిస్థలం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నదని చెప్పారు. దానికోసమే మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించారని అన్నారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టులు ఈ అంశంపై ప్రభుత్వ వైఖరి మరింత స్పష్టంగా ఉండేందుకు వీలుగా సూచనలు, సలహాలు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకురావచ్చునన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జర్నలిస్టుల ఇంటిస్థలాల కేటాయింపునకు గల అవకాశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జర్నలిస్టులకు అనుకూలంగా వ్యవహరించేవారే కనుక త్వరలోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయనే అశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# వ్యవస్థలు తలకిందులైతే!

శంకర్
ది న్యూస్ తెలుగు

ఒకనాడు సీబీఐ అంటే అక్రమార్కులు భయపడేవారు. ఈడీ కేసు అనగానే దొంగలు జడుసుకునేది. కానీ కాలం మారింది. మోదీ జమానాలో అక్రమార్కులకు సీబీఐ అండగా ఉంటుంది. బీజేపీ కండువా కప్పుకుంటే చాలు కాపాడేస్తుందనే నమ్మకం కలిగింది. ఈడీతో ఊడేదేమీ లేదని తేలింది. కమలదళం వెంట కదిలితే చాలనే అభిప్రాయానికి వచ్చేశారు. కానీ అసలు సమస్య ఏమంటే ఇప్పుడు ఏ నేరం చేయని వాళ్లు భయపడాల్సి వస్తోంది. వ్యవస్థలు తలకిందులైతే అదే జరుగుతుంది.

ప్రబీర్ పుర్కాయస్త ఓ ఉదాహరణ. ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలనలో విధానాల లోపాన్ని ఎండగట్టారు. న్యూస్‌క్లిక్ అనే ఓ డిజిటల్ మీడియా సంస్థను ప్రారంభించి పాలకులకు ఎదురొడ్డారు. అంతే దిల్లీ పోలీసులతో పాటు ఈడీ రంగంలో దిగేసింది. మొత్తం మీడియాను నయానా..భయానో దారికి తెచ్చేసుకుంటే మీరేంటి డిజిటల్ వేదికలు వాడుకుని నిలదీస్తారా అంటూ కన్నెర్ర చేసింది. మనీల్యాండరింగ్‌కి పాల్పడ్డారంటూ కేసులు పెట్టి, జైలు పాలుజేసింది.

కట్ చేస్తే అసలు అది కేసే కాదని తాజాగా హైకోర్ట్ తీర్పు ఇచ్చింది. అంతటితో ఆగకుండా ఈ వ్యవహారమంతా "న్యాయ ప్రక్రియను ఘోరంగా దుర్వినియోగం చేయడమే" అని వ్యాఖ్యానించింది. అంటే ఇన్నాళ్లుగా ఈడీ సాగించిన రాద్ధాంతం తమకు గిట్టని వాళ్లని కట్టడి చేయడానికేనని తేటతెల్లమయ్యింది. కానీ ఈలోగా జరగాల్సిన నష్టం జరిగింది. ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకోవాలని, రాజ్యాంగబద్ధమైన తీరున సాగాలని ఆశించిన ప్రబీర్ సంస్థ న్యూస్‌క్లిక్ మూతపడింది. జర్నలిస్టులు ఉద్యోగాలు కోల్పోయారు. యువ రిపోర్టర్లు, మీడియా ప్రతినిధులు కూడా దోషులుగా ముద్రవేయబడ్డారు. ప్రబీర్‌తో పాటుగా మరికొంతమంది జర్నలిస్టులను సమాజం అనుమానించే పరిస్థితి వచ్చింది. అనేక అవమానాలతో వాళ్లంతా సాగాల్సి వచ్చింది.

మరిప్పుడు కోర్ట్ తేల్చిన దాని ప్రకారం వాళ్లంతా నిర్దోషులు. దొంగ కేసులతో వేధింపులకు గురయిన వారు. విలువైన కాలన్ని, ఓ మీడియా సంస్థను కోల్పోయిన బాధితులు. వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకున్న ప్రభుత్వాల తప్పుడు ధోరణులకు బలయినవారు.

ఒక కేసు సంవత్సరాల తరబడి కొనసాగి, చివరికి కోర్టు దానిని కొట్టివేస్తే, ఆ కాలంలో జరిగిన నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారు? ఉద్యోగాలు కోల్పోయిన జర్నలిస్టులకు పరిహారం ఎవరు చెల్లిస్తారు? ఏళ్ల తరబడి ప్రజల ముందు తమ నిజాయితీ నిరూపించుకోవాల్సిన దుస్థితి రావడం ఏమనాలి. కోల్పోయిన విశ్వసనీయతకి వెలకట్టేదెవరు?

ఈ దాడి మూలంగా కోల్పోయిన అవకాశాలను, కుప్పకూలిపోయిన సంస్థను ఎవరు తిరిగి తీసుకురాగలరు?

ఇలాంటి ప్రశ్నలు మనముందుకు ఈ ఉదంతం తీసుకొచ్చింది. దేశాన్ని దోచుకుంటున్న వాళ్లు, వేల కోట్లు స్వాహా చేసినా ఏమీ కాదని, ఓ సాధారణ వ్యక్తి పేరున ఏ కేసు పెట్టి లోపలేసినా అడిగేవారుండరనే పరిస్థితి ఎన్నాళ్లు. దర్యాప్తు సంస్థలు తప్పుడుదారిలో సాగుతుంటే కట్టడి చేయాల్సిన అవసరం లేదా. ఇలాంటి కేసుల బనాయింపు వెనుక అసలు కారకులను వెలికితీసేందుకు విచారణ చేయాల్సిన అవసరం లేదా. ఇంతటి మహా ఘనమైన ప్రజాస్వామ్యమా పరిపరివిధాలా వర్ధిల్లు.



## విలేఖరి పై దాడిని ఖండన

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం ప్రజాశక్తి విలేఖరి హనుమంత రాయుడుపై దాడి చేసిన ఉపాధి హామీ పథకం ఏపీఓ మురళీధర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కల్యాణదుర్గం డిఎస్పి రవిబాబుకి ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కుందుర్పి మండల కేంద్రంలో ప్రజాశక్తి దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న హనుమంతరాయుడిపై ఎపిఓ అకారణంగా దాడిచేయడాన్ని నియోజకవర్గ కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ డిఎస్‌పిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

# జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిరక్షణే ధ్యేయం




## కృష్ణా జిల్లా ఫెడరేషన్ మహాసభ

జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి రక్షణే ధ్యేయంగా సమస్యలపై పనిచేస్తూ నిరంతరం కృషిని కొనసాగిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ వెంకట్రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ కృష్ణాజిల్లా మహాసభ గన్నవరం రోటరీ ఆడిటోరియంలో జరిగింది. మహాసభకు కే వెంకటప్పయ్య, ఆర్ అచ్యుతరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మహాసభలో వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మార్చి 4న విజయవాడలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్య సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జర్నలిజం రక్షణ లేని వృత్తిగా మారిపోయిందని భద్రత పరిస్థితులు, ఇతర సదుపాయాలు తదితర అంశాలు అన్నిటిపై అధ్యయనం చేసేందుకు మెరుగైన చర్యలు చేపట్టేందుకు వీలుగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కన్వీనర్ వీసం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు తమ డిమాండ్ల సాధన కోసం రాబోయే రోజుల్లో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అమరావతి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చిగురుపాటి సతీష్ బాబు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను రూపుమాపటానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జర్నలిస్టులపై దాడుల నిరోధానికి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు వెలమా రామారావు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, సురేష్‌లు మాట్లాడుతూ గత పదేళ్లుగా జర్నలిస్టులకు రైల్వే పాసులు ఇవ్వడంలేదని ఈ విషయమే కృషి కొనసాగించాలని కోరారు. రద్దు చేసిన జర్నలిస్టు చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ


రవిశంకర్


ఉదయకుమార్

సభ్యులు కళ్యం వెంకటేశ్వరరావు సందేశం ఇస్తూ అందరి మంచి కోరే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడుతూ జర్నలిజం ప్రమాదంలో ఉందని దాన్ని బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎంబీనాథన్, జిల్లా అధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు, ఏపీబీజేఏ జిల్లా కన్వీనర్ అలీం, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం రాఘవులు



సందేశాలు ఇచ్చారు. తొలుత ఫెడరేషన్ జెండాను సీనియర్ పాత్రికేయులు ఉడుతా రామకృష్ణ ఆవిష్కరించారు. గన్నవరం ఎంపీపీ అనగాని రవి జర్నలిస్టులను అభినందిస్తూ సందేశం ఇచ్చారు. కార్యదర్శి నివేదికను వై శ్రీనివాసరావు ప్రవేశపెట్టారు. కీర్తిశేషులు దాసరి కామేశ్వరరావు, నెక్కలపు శ్రీనివాసరావు, మేకా వీరాంజనేయులు, అల్లూరి శ్రీనివాసరావుల మృతికి మహాసభ సంతాపం తెలియజేసింది. ఏపీడబ్ల్యుఎఫ్ గన్నవరం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మహేష్, సురేష్ తదితరులు మొత్తం కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. సీనియర్ పాత్రికేయులు దాసరి కామేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు దాసరి శ్రీనివాస్ ప్రతినిధులకు జ్ఞాపికలను అందజేశారు.

**మహాసభ తీర్మానాలు**

జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టులపై దాడులను ఆపాలని, రైల్వే పాసులు ఇవ్వాలని, ప్రమాద బీమా పునరుద్ధరించాలని, ఆరోగ్య భీమా పథకం పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత వైద్య అందించాలని, దాడుల నివారణకు హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానించింది,

**ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక**

మహాసభలో ఏపీ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ కృష్ణాజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా దొండపాటి ఉదయకుమార్ (ఆంధ్రజ్యోతి గన్నవరం), జొన్న రవిశంకర్ (ప్రజాశక్తి కోడూరు), గౌరవాధ్యక్షులుగా సీనియర్ పాత్రికేయులు ఉడతా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కే శ్రీనివాస్, రవీంద్రనాథ్ ఠాగూర్, చిట్టిబాబు, సహాయ కార్యదర్శులుగా బి రమేష్ (ప్రజాకాంక్ష ఉయ్యూరు), పి వేణుగోపాలస్వామి (ఆంధ్రజ్యోతి ఉయ్యూరు), కే కోటయ్య (ప్రజాశక్తి గుడ్లవల్లేరు), ఇంద్రగంటి గోపికృష్ణ (ఆంధ్రప్రభ విజయవాడ రూరల్), కోశాధికారిగా ఆర్ అచ్యుతరావు (ఆంధ్రజ్యోతి హనుమాన్ జంక్షన్) లు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి రాజు (ప్రజాశక్తి కంకిపాడు), ఏ అనిల్ (ఆంధ్రప్రభ గుడివాడ), నాగేంద్ర (సాక్షి పమిడిముక్కల), తొట్ల శ్రీనివాసులు (ఆంధ్రజ్యోతి కోడూరు), కొండవీటి సురేష్ (ఆంధ్రప్రభ కోడూరు), కేయూ గగారిన్ (ప్రజాశక్తి అవనిగడ్డ), శ్రీనివాస్ (ప్రజాశక్తి బంటుమిల్లి) ఎన్నికయ్యారు.

**ఏపీ బీజేఏ కమిటీ**

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కార్యదర్శిగా జె. వెంకటప్పయ్య (జెటి వి), ఉపాధ్యక్షులుగా ఎస్ బాలస్వామి (ఏబీఎన్ గన్నవరం), ఎంఎస్ఎన్ నాగరాజు (రాజా సిటీ కేబుల్ పెనమలూరు), సహాయ కార్యదర్శులుగా కే శ్రీనివాసరావు (డిఎన్ఏ టీవీ), బాల కోటేశ్వరరావు (6టివి) ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుని ఎన్నిక వాయిదా పడింది.



# కళను కుంచెతో సాయుధం చేసినవాడు

గౌరవ్

భారతీయ చిత్రలేఖనాన్ని మానవీయం చేసిన మహోన్నతుడు చిత్తప్రసాద్ .కళకు అర్థం పీడిత ప్రజల బాధలు, వేదనల్ని చిత్రీకరించడమే అని చాటిన విశిష్ట వ్యక్తి. ఒక కళాకారుడు ప్రజల పక్షం వహిస్తే ఎంతటి మార్పు సాధ్యమౌతుందో ఆచరణలో చూపినవాడు.


పేరు ప్రతిష్టలు, ధన కీర్తులకి అతీతంగా దీనజన ఉద్ధరణలోనే కళకు అర్థం నిర్దేశించినవాడు.ప్రకృతి అందాలు, ప్రేమకలాపాల దృశ్యాలతో రాజప్రాసాదాల పరదాలకి మాత్రమే పరిమితం అయిన చిత్రకళను మొట్ట మొదటిసారి పెన్సిల్ స్కెచ్‌లు ఉపయోగించి పీడిత మానవుడి వైపు నిలిపిన రాజకీయ సామాజిక కళా కార్యకర్త.

ఎవరి సహకారం లేకుండా స్వయం కృషితో ఎదిగిన చిత్రకళా వైతాళికుడు. ఇలా చెప్పుకుంటే ఎన్నో.

1915, జూన్ 21 న కలకత్తాలోని నైహటిలో జన్మించిన చిత్తప్రసాద్ చిట్టగాంగ్ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నాడు. కమ్యూనిస్టుగా విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. కలకత్తాలోని 'ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ' కాలేజీలో ప్రవేశానికి 'రాజకీయాలకు దూరంగా ఉండాలనే' నిబంధన పెట్టారనే కారణంతో ఇష్టమైన చదువును కూడా వదులుకున్నాడు.

ఆ కారణంగానే ప్రఖ్యాత శాంతినికేతన్ లోని విశ్వభారతి విశ్వవిద్యాలయంలోని కళాభవన్ కళాశాలలో కూడా చిత్తప్రసాద్ ప్రవేశాన్ని నిరాకరించారు.

బహుశా అందుకే రెట్టింపు ఉత్సాహంతో నిబద్ధత కలిగిన స్వతంత్ర కళాకారుడుగానే తనను తాను రూపొందించు కున్నాడు. ఒకవైపు విదేశీ సామ్రాజ్యవాదాన్ని, మరోవైపు స్వదేశీ భూస్వామ్య



వ్యవస్థలోని అనవమానతల్ని తీవ్రంగా వ్యతిరేకించి స్వీయ సాధనతో అసాధారణ కళాధారిగా మారాడు.

చిత్తప్రసాద్ స్వతహాగా అన్వేషి, అధ్యయన పరుడు. అందులో భాగంగానే భారతీయ సామాజిక వ్యవస్థలో కులతత్వం ఎంత లోతుగా పాతుకుపోయిందో అర్థం చేసుకున్నాడు. కులాధిపత్యానికి చిహ్నమైన 'భట్టాచార్య' ఇంటిపేరును ధైర్యంగా తన పేరులో నుండి తొలగించు కున్నాడు.

సమాజ గతిని మార్చడమే సరైన కళకు అర్థం అని నమ్మాడు కనుకనే నిరంతర చైతన్య ప్రవంతిలో భాగమయ్యాడు.ఎక్కడా మూసగా ఆగిపోకుండా జీవితాంతం పెను ప్రవాహంగా మునుముందుకే సాగిపోయాడు. అట్టడుగు ప్రజల కష్టాలకు కన్నీళ్ళకు అద్దం పట్టేలా తన చిత్రకళా నైపుణ్యాన్ని వినూత్నంగా బలోపేతం చేసుకున్నాడు.

1943 రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బెంగాల్‌లో తీవ్ర క్షామం తాండవించింది.లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పసిపిల్లలతో సహా ఎందరో అభాగ్యులు జీవచ్ఛవాలుగా మిగిలారు. అప్పటికే కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా ఉన్న చిత్తప్రసాద్ మరో కళాకారుడు జైనుల్ అభిదీన్, ఫోటోగ్రాఫర్ సునీల్ జానాతో కలసి మిడ్నాపూర్ పరిసర ప్రాంతాల్లో పాత్రికేయుడిగా ప్రయాణించాడు.

ఆ ప్రమాదకరమైన సమయంలో ధైర్యంగా గ్రామగ్రామాన పయనిస్తూ అన్నార్తుల ఆకలి కేకలకు అసలు కారణం కనుగొన్నాడు. సామ్రాజ్యవాద స్వార్థాన్ని,మానవాళి పట్ల దాని దుర్మార్గాన్ని గుండె ద్రవించేలా చిత్రించాడు. అసంఖ్యాక కరువు బాధితుల సమిష్టి దుఃఖాన్ని, ఈతి బాధల్ని కలంతోనూ,కుంచెతోనూ కూడా ఏక కాలంలో అక్షరబద్ధం చేసిన గొప్ప మనిషి చిత్తప్రసాద్.

చరిత్రలో అత్యంత హేయమైన కరువును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడమే కాక దానిని మొత్తంగా చిత్రలేఖనాల రూపంలో నిక్షిప్తం చేసిన అద్వితీయ కళాకారుడు చిత్తప్రసాద్.అందుకే,ఆనాటి కరువుని కళ్ళకు కట్టినట్లు చూపించిన చిత్తప్రసాద్ చిత్ర లేఖనల ప్రచురణ గ్రంథం హంగ్రీ బెంగాల్ సామ్రాజ్య వాదుల గుండెల్లో ప్రకంపనలు రేపింది.

మానవ నిర్మిత కరువుకు తిరుగులేని సాక్ష్యంగా ఆ పుస్తకం నిలుస్తుందని పాలకులు భావించారు.కరువనేది మానవ నేరమని తెలిస్తే పీడితుల్లో తిరుగుబాటు చైతన్యం వస్తుందనే భయంతో సుమారు ఐదు వేల పుస్తక ప్రతుల్ని అక్రమంగా స్వాధీనం చేసుకుని తగలబెట్టేసారు.

ఒక కళాకారుడు ప్రచురించిన చిత్రలేఖనాలకు భయపడి ఏకంగా వేల సంఖ్యలో పుస్తకాలు కాల్చివేసారంటేనే ఆ చిత్రాలు ఎంత శక్తివంతమైనవో అర్థం చేసుకోవచ్చు. అప్పటికే బొంబాయిలో ఉంటున్న తన తల్లికి ప్రేమగా పంపిన ఒకే ఒక్క పుస్తక ప్రతి దశాబ్దాల తర్వాత

బయటపడింది.

దాని ఆధారంగా చిత్తప్రసాద్ నమోదు చేసిన ఆ హృదయ విదారక చిత్రాలు 'పీపుల్స్ వార్ ', 'పీపుల్స్ ఏజ్ ' వంటి వామపక్ష పత్రికల్లో విస్తృతంగా చర్చకు దారి తీసాయి.ఆ రకంగా చిత్రకళా జగత్తులో చిత్తప్రసాద్‌ని ప్రజలపక్షం వహించే తిరుగులేని కళా దార్శనికుడిగా ప్రతిష్టించాయి.

తదనంతరం కాలంలో రాజకీయాలకి దూరమైన చిత్తప్రసాద్ ప్రపంచ శాంతి ఉద్యమంలో క్రియాశీలకంగా మారాడు. చెకోస్లోవేకియా దేశపు ప్రసిద్ధ కళాకారుడు ఫ్రాన్సిక్ సలాబా సహకారంతో బొంబాయిలో బీద వీధి బాలల కోసం' ఖేల్ ఘర్ ' పేరిట తోలుబొమ్మలాట సంస్థను నిర్వహించాడు.

ఈ దేశం విస్మరించిన చిత్తప్రసాద్ అపురూప చిత్రలేఖనాలు చెకోస్లోవేకియా దేశ రాజధాని ప్రేగ్ నగరంలోని జాతీయ మ్యూజియంలో ఉన్నాయి.అంతే కాదు,చిత్తప్రసాద్ జీవితం, కృషి కోసం చెక్ దేశానికి చెందిన పావెల్ హూబేల్ 'కన్ఫెషన్స్' పేరుతో డాక్యుమెంటరీ చిత్రం కూడా నిర్మించడం గమనార్హం.

"పరిస్థితుల ప్రభావం వల్లనే నా కుంచెని పదునైన ఆయుధంగా మలచుకొన్నాను."అని గర్వంగా ప్రకటించుకున్న చిత్తప్రసాద్ వ్యక్తిగత జీవితంలో అవివాహితుడిగానే ఉన్నాడు.

కవిగా, రచయితగా, పాత్రికేయుడిగా, పర్యాటకుడిగా, నిత్య అధ్యయనశీలిగా, పరిశోధకుడిగా అరుదైన చిత్రలేఖకుడిగా జీవితాంతం ప్రజల కోసమే కృషి చేసిన చిత్తప్రసాద్ 63 ఏళ్ళ వయసులో నవంబర్ 13, 1978న అనారోగ్యంతో మరణించాడు.

కళకి అర్థం పీడిత ప్రజల హితమేనని కుంచెతో క్రియాశీలంగా నినదించిన చిత్తప్రసాద్ స్ఫూర్తిని సజీవంగా నిలుపుకోవడమే అతడికి ఇవ్వదగిన సార్థక నివాళి.

**(జూన్ 21 చిత్తప్రసాద్ 111 వ జయంతి సందర్భంగా)**



# రెడ్డిగూడెం మండల జర్నలిస్టుల పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ

ఏపిడబ్ల్యూజేఎఫ్-ఏపీబీజేఏ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండలానికి చెందిన జర్నలిస్టుల పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు విద్యలో మరింత ప్రతిభ కనబరచాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి నోట్‌బుక్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, జనలపాటి వేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి కుటుంబాలకు తోడ్పాటుగా విద్యా సహాయక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజేఎఫ్ ఎన్‌టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్, మండల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.



**కొందుర్గు ప్రజాశక్తి విలేకరి హనుమంతరాయుడిపై దాడికి పాల్పడిన ఉపాధి హామీ పథకం ఎపివో మురళీధర్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించిన ఫెడరేషన్ ప్రతినిధులు**



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ)ల 4వ కృష్ణా జిల్లా మహాసభలకు గన్నవరం సిద్ధమైంది. ఈ నెల 28న స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు ఎపిడబ్ల్యూజేఎఫ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు జె. వెంకటప్పయ్య, జిల్లా కార్యదర్శి వై. శ్రీనివాసరావు తెలిపారు.

శుక్రవారం గన్నవరంలోని సీపీఎం కార్యాలయం (చింతపల్లి పాపారావు భవన్)లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. జర్నలిజం రంగానికి విశేష సేవలు అందించిన సీనియర్ జర్నలిస్టులు దాసరి కామేశ్వరరావు, నెక్కలపు శ్రీనివాసరావుల సేవలను గుర్తిస్తూ, సభా ప్రాంగణంలోని వేదికలకు వారి పేర్లను నామకరణం చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఎపిడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏలు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం పోరాటం చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ మహాసభలో ప్రధానంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఆరోగ్య బీమా, సంక్షేమ పథకాలు, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. మచిలీపట్నం, పెడన, గుడివాడ, పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, గన్నవరం నియోజకవర్గాల జర్నలిస్టులు ఇప్పటికీ ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

గతంలో బంటుమిల్లి, ఇబ్రహీంపట్నం, నందిగామ ప్రాంతాల్లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం చేసిన పోరాటాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని వారు వివరించారు. నున్నలో 166 మంది జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని, ఉయ్యూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో ఉన్న భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, సమర్థవంతమైన ఆరోగ్య బీమా అందించాలని కోరారు. అలాగే మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై ఈ మహాసభలో పలు కీలక తీర్మానాలను ఆమోదించనున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ సమావేశంలో ఎపిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు వల్లభనేని సురేష్, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు పి. మహేష్, కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. అచ్యుతరావు, సీనియర్ జర్నలిస్టులు ఉడతా రామకృష్ణ, డి. ఉదయ్ కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు



## సాక్షి జర్నలిస్టు రబ్బానీ మృతి

వరంగల్ సాక్షి డెస్క్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న జర్నలిస్టు రబ్బానీ రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. రబ్బానీ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# సమాచార శాఖలో ప్రమోషన్లు







సమాచార శాఖలో ఉన్నతాధికారులు పలువురు ఇటీవల కాలంలో పదవీ విరమణ చేయడంతో కొందరు అధికారులకు ప్రమోషన్లు లభించాయి. అడిషనల్ డైరెక్టర్ బాధ్యతలు నిర్వర్తించిన స్వర్ణలత, పి కిరణ్ కుమార్‌లు పదవీ విరమణ చేశారు. విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా, మీడియా అకాడమీ కార్యదర్శిగా పనిచేసిన మణిరామ్ కూడా ఇదేసమయంలో రిటైరయ్యారు. దాంతో పలువురు అధికారులు ప్రమోషన్లు పొందారు. కృష్ణాజిల్లాలో డిడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర ప్రసాద్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. జోన్-1 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా కే సదారావు విశాఖపట్నంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పి తిమ్మప్ప విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.



# ఫెడరేషన్ వినతికి సానుకూలంగా స్పందించిన తిరుపతి కలెక్టర్

తిరుపతి జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీబీజేఏ) జిల్లా కలెక్టర్‌ను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి వెంటనే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ లో మాట్లాడి, ఈ మేరకు ఆదేశాలు పంపాలని తెలిపారు. వెంటనే ఆదేశాలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలసిన వారిలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు గాజుల చెంగలరాయలు (గాంధీ – మనం), ఇంకా పానేటి చెంగలరాయలు (ఆంధ్ర మనం), తిరుపతి ఫెడరేషన్ నాయకులు బాల సుబ్రహ్మణ్యం (ప్రజాశక్తి), శ్రీనివాస్ (ఆంధ్ర మనం), కృష్ణ మూర్తి (ఆంధ్ర మనం), సుధీర్ (ప్రజాశక్తి) ఏపీబీజేఏ అధ్యక్షుడు దాచేపల్లి కిరణ్, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ రావు ఉన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులంతా ఐక్యం కావాలి



**జ**ర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రేవటి రామాంజనేయులు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఫెడరేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కళ్యాణదుర్గం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు షఫీ, కార్యదర్శి రేవటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎ.సోమశేఖర్ రెడ్డి (ప్రజా శక్తి), అధ్యక్షుడిగా ఐ. మస్తాన్ (ఎన్‌టివి), ఉపాధ్యక్షులుగా వై.లక్ష్మణ్ (సాక్షి), ఏసి తిప్పాయి స్వామి (ఐ న్యూస్), అస్లాం (6టీవీ), కార్యదర్శి సుధా మోహన్ (నేటి సూర్య), సహాయ కార్యదర్శులుగా రామకోటీ (ఆంధ్ర ప్రభ), రంగ స్వామి (సూర్య), సాబ్జాన్ (99 టీవీ), కోశాధికారి అనిల్ కుమార్ (ఏపీ టుడే), షఫీ (రాజ్ న్యూస్), ముబారక్ (మేఘ 9), వన్నూర్ స్వామి (వైకె టీవీ), బండి సుధా (మనం), తిమ్మప్ప (టైమ్ లైన్), కిషోర్ (అక్షర), నాగార్జున (సూర్య), రాజేష్ (మనం), అస్లాం (ఆర్‌టివి)లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా షఫీ,రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్ధాలుగా జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని.. వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటి గురించి మాట్లాడటం లేదన్నారు. కొన్ని యజమాన్యాలు వేతనాలు ఇవ్వకపోయినా సమాజం కోసం పని చేస్తున్న జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. నిజాయితీగా వార్తలు రాసే జర్నలిస్టులకు రక్షణ కరవైందని, వారికి రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఈ సమస్యలపై ఫెడరేషన్ పోరాడుతోందని రామాంజినేయులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు డాక్టర్ సూర్య, జయ ప్రకాష్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలు

విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో ప్రతిభకు ప్రోత్సాహం పేరిట వైజాగ్ మీడియా అవార్డ్స్ స్కూల్ ఆఫ్ థియేటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులకు అవార్డులను ప్రదానం చేశారు. 60 మంది జర్నలిస్టులకు, చదువుల్లో ప్రతిభ చూపుతున్న 150 మంది జర్నలిస్టుల పిల్లలకు నిర్వాహకులు పురస్కారాలు అందజేశారు. సిపి శంక బ్రత బాగ్చి, బిజెపి అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్వాహకులు ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# యూపీఐ తో పిఎఫ్ విత్ డ్రా

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ చందాదారులకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి శుభవార్త చెప్పింది. ఇకపై పీఎఫ్ అకౌంట్ నుంచి డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ఆఫీసర్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా యూపీఐ ఎటిఎం కార్డుల ద్వారా డబ్బు తీసుకునే సరికొత్త సదుపాయాన్ని జూన్ నెలాఖరు కల్లా ప్రారంభించడానికి ప్రభుత్వం తుది ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా సెక్షన్ 201 సర్వర్ అందుబాటులోకి రాగానే ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ విధానం ద్వారా చందాదారులు తమ పిఎఫ్ సిమ్‌లో 50% నుంచి 75% వరకు నేరుగా వారి ఆధార్ లింక్డ్ బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేసుకోవచ్చు, లేదా ఏటీఎం ద్వారా విత్ డ్రా చేసుకోవచ్చు. అయితే భవిష్యత్తు అవసరాల కోసం అకౌంట్లో కనీసం 25% బ్యాలెన్స్ తప్పనిసరి. రిటైర్మెంట్ ఫండ్‌గా లాక్ చేసి ఉంచుతారు. కొత్తగా వస్తున్న ఈపీఎఫ్ 3.0 వ్యవస్థతో పిఎఫ్ సేవలో పేపర్ వర్క్ జాప్యం, ఆఫీసర్ల ప్రమేయం పూర్తిగా తగ్గిపోతాయి. ఇప్పుడు 5 లక్షల రూపాయల వరకు ఉన్న పీఎఫ్ అడ్వాన్స్ క్లెయిములను ఎవరితోనూ అవసరం లేకుండా సిస్టమే ఆటో సెటిల్మెంట్ ద్వారా వెంటనే ప్రాసెస్ చేస్తుంది. అంతేకాదు పేరు లేదా ప్రొఫైల్ వివరాల సవరణల కోసం పిఎఫ్ ఆఫీసులకు వెళ్లాల్సిన పని లేకుండా ఆన్లైన్ డిజిటల్ రికార్డు సవరణల సౌకర్యం కల్పిస్తున్నారు. ఆధార్ ఆధారిత డిజిటల్ ధ్రువీకరణల వల్ల ప్రతి చిన్న విషయానికి కంపెనీ యజమానిపై ఆధార పడాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే ఈ కొత్త ఫీచర్లు వాడాలంటే చందాదారులు తమ యుఏఎన్‌కు ఆధార్ లింక్ చేయడం, బ్యాంక్ వివరాలు సరి చూసుకోవడం, పాన్ డేటా ఒకేలా ఉంచుకోవడం వంటి పనులు ముందే పూర్తి చేసుకోవాలి.

దేశంలోని ఏడు కోట్ల మందికి పైగా ఉన్న పీఎఫ్ చందాదారుల ఖాతాల్లోకి ఈ నెలలోనే వడ్డీ డబ్బులు జమ కాలున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ నిర్ణయించిన 8.25% వడ్డీ రేటుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖరారైన ఈ వడ్డీ రేటును ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది కూడా కొనసాగించింది. కొత్తగా అప్‌డేట్ చేసిన టెక్నాలజీ ద్వారా ఈసారి వడ్డీ డబ్బులు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే ఖాతాల్లో కనిపించనున్నాయి.



# గుంటూరు కలెక్టర్‌కు ఫెడరేషన్ కృతజ్ఞతలు

గుంటూరు జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) లకు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ జిల్లా యూనియన్ ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యూనియన్ చేసిన విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ రాయితీ వల్ల జర్నలిస్ట కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు వారి పిల్లల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఫెడరేషన్ తరపున ధన్యవాదాలు తెలియ జేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం చూపుతున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొని జిల్లా కలెక్టర్, డీఈఓలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు.

# కర్నూలు కలెక్టరుకు ఫెడరేషన్ వినతి



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా కలెక్టరుకు విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోరంట్లప్ప, జిల్లా నాయకులు టీజీ ప్రసాద్, చంద్రమోహన్, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం శివశంకర్, ఎం ఎర్రమల ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ఏ సిరిని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి జిల్లాలోని అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలాకాలం నుంచి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీతో విద్యా సదుపాయం కల్పిస్తున్నారని స్పష్టం చేశారు. విద్యాసంవత్సరం ఆరంభం అవుతున్న ఈ తరుణంలో జర్నలిస్టుల స్థితిగతులను దృష్టిలో పెట్టుకుని వారి పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం కలుగకుండ చూసేందుకు వీలుగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. అయితే అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని విద్యాసంస్థలు సానుకూలంగా స్పందిస్తే మరికొన్ని కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని భావించడం లేదని ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని తప్పనిసరిగా ఉత్తర్వుల అమలుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కలెక్టర్ల చొరవతో ఈ సదుపాయం అమలవుతున్నదని చెప్పారు. ఈ అంశంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆయా జిల్లాల వివిధ జిల్లాలలోని కలెక్టర్ల ఉత్తర్వులను పరిశీలన చేసి ఫైల్ పెట్టాలని డిఈఓకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పురుషోత్తం, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మిగనూరులో

ఎమ్మిగనూరులో ఫెడరేషన్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితవిద్య అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. నియోజకవర్గ గౌరవాధ్యక్షులు బి దేవేంద్ర మూర్తి, గిప్సన్, అధ్యక్షులు షబ్బీర్, కార్యదర్శి నాగరాజు నాయుడు తదితరుల నాయకత్వంలో మండల ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఆంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నరసింహులు, సోహెల్, సునీల్, రెహమాన్, సురేంద్ర, మురళి, మూసా రాజు, విజయ్, లతీఫ్, ఖాదర్, మేగ్మాన్, ఈరన్న, అలియాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ అంశంపై ఎమ్మిగనూరు మండల విద్యాధికారి స్పందిస్తూ సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తక్షణమే తీసుకువెళతానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పరిస్థితిని తెలియజేసి కలెక్టరు సానుకూలంగా స్పందిస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఈ సమస్యపై పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎమ్మెల్యేను కలిసిన ఫెడనేషన్, ఏపిబిజెఎ నాయకులు



మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ ఎన్టీఆర్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గొల్లపూడిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూల కుండీ, నోటు పుస్తకాలు అందజేశారు. ఇటీవల ఎపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ ఎన్టీఆర్ జిల్లా మహాసభలు జరిగిన నేపథ్యంలో నూతన కమిటీ సభ్యులు ఆయన కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులకు ఎప్పుడు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఆరోగ్య భీమా కట్టడంపై ఎమ్మెల్యే వసంతకు ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాస్, ఏపీ బీజేఏ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మెరుగుమాల రాఘవులు, ఏపీడబ్ల్యుజేఎఫ్, ఏపీబిజేఏ మైలవరం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సల్మాన్, సురేష్ బాబు వీసం, ఉయ్యూరు వెంకట్, దాని ప్రతాప్ కుమార్, ఏపీడబ్ల్యుజేఎఫ్, ఏపీ బీజేఏ జిల్లా కమిటీ సభ్యులు టంగుటూరి శ్రీనివాస్, పలె నరేష్, రాజీవ్ రాజు, మైలవరం నియోజకవర్గ ఏపీ బీజేఏ కోశాధికారి, ఉపాధ్యక్షులు కే మనోహర్, ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను కోరిన ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ నాయకులు

మైలవరం నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య తన దృష్టిలో ఉందని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కారం చేస్తానని జర్నలిస్టు నాయకులకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉందని ఆయన నాయకులు దృష్టికి తెచ్చారు. త్వరగా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వసంతను జర్నలిస్టు నాయకులు కోరారు.

---

# పాత్రికేయుని ఇంటిపై దాడిచేసిన అయిదుగురిపై కేసు

సూళ్లూరుపేట మండలం ఎర్రబాలెం గ్రామంలో నివాసం ఉంటున్న టైమ్స్ నౌ పాత్రికేయుడు ఎంబేటి చందు కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు విలేకరి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు జూన్ 14వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో చెంచు కృష్ణ అలియాస్ చెంచు వెంకయ్య, మునిరాజా, హరిబాబు, ఎర్రబోతు రాజశేఖర్ అనే ఐదుగురు వ్యక్తులు గ్రామంలోని చందు ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో చందు ఇంట్లో లేకపోవడంతో ఆయన తమ్ముడు మదన్, తల్లి పై దాడి చేసి ఇంట్లోనే వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సింది అని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. మదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో తమకు వ్యతిరేకంగా వార్తా కథనాలు ప్రచురిస్తున్నారని అనుమానంతో నిందితులు కక్షపెంచుకున్నట్టు వెల్లడయింది. ఈ కేసులో వేరే వారి ప్రమేయం ఉందా అనే విషయం కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో మీడియా పాత్ర కీలకం

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు యంత్రాంగానికి ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారం ఎంతో కీలకమని జిల్లా పోలీస్ సూపరిండెంట్ ధీరజ్ అన్నారు.

మదనపల్లిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో ప్రత్యేక ముఖాముఖి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నివసించే సామాన్య ప్రజల సమస్యలను సైతం పోలీసుల దృష్టికి తీసుకురావడంలో మీడియా చురుకైన పాత్ర పోషించాలని కోరారు.





# ‘సహకారభూమి’కి తోడ్పాటుపై ఆప్కాబ్ నిర్ణయం!

సహకార రంగ ప్రగతి కోసం నిస్వార్థంగా కృషిచేస్తున్న సహకారభూమి పక్షపత్రికకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్) నుంచి అన్నివిధాలా సాయం అందించే విషయమై కార్యవర్గ సమావేశంలో చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని సంస్థ చైర్‌పర్సన్, మాజీ శాసనసభ్యులు గన్ని వీరాంజనేయులు భరోసా ఇచ్చారు. సహకార రంగం బలోపేతం కావడానికి ఇటువంటి పత్రికలు అత్యంత అవసరమని చెప్పారు. సహకారభూమి వ్యవస్థాపకులైన సహకారవేత్తలు, సీనియర్ జర్నలిస్టులు, సంఘాలు స్వప్రయోజనాలు ఆశించకుండా, సహకార ఉద్యమం కోసం మహోన్నత లక్ష్యంతో పత్రికను నిర్వహిస్తున్నారని కొనియాడారు. సహకార రంగానికి సంబంధించిన సమాచారం, చరిత్ర, విలువలు, స్ఫూర్తిదాయక గాథలను ప్రజలకు చేరవేస్తూ పత్రిక ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తోందని గన్ని కితాబిచ్చారు.

సహకారభూమి తృతీయ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను విజయవాడలోని సహకారభూమి జర్నల్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జూన్ 9న ఉదయం జరిగిన సభలో వీరాంజనేయులు ఆవిష్కరించారు. విశిష్ట అతిథి, నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్

## చైర్‌పర్సన్ గన్ని వీరాంజనేయులు భరోసా



ఎం.ఎస్.ఆర్. చంద్ర మూర్తికి తొలి ప్రతి, గౌరవ అతిథి, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రామకృష్ణకు మలి ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పత్రిక కార్యాలయంలో సహకార స్ఫూర్తిని ప్రతిబింబించే నినాదాలు, సహకారోద్యమ ప్రముఖుల చిత్రాలు, వారి సేవలను ప్రదర్శించిన తీరు తనను ప్రభావితం చేసిందని చెప్పారు. పత్రికకు రూపకల్పన చేసిన సహకారోద్యమ సీనియర్ నాయకుడు దాసరి కేశవులును హృదయపూర్వకంగా అభినందిస్తున్నానన్నారు.

సహకార రంగం అందిస్తున్న సేవలు, సాధిస్తున్న విజయాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రజలకు తెలియాలంటే సహకారభూమి వంటి వేదికలు నిరంతరం కొనసాగాల్సిన అవసరం ఉందని గన్ని అన్నారు. ఇందుకోసం సహకారభూమి పత్రికకు సంస్థాగత మద్దతు అందించే అంశాన్ని ఆప్కాబ్ స్థాయిలో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఆప్కాబ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి)లు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) స్థాయిలో పత్రిక విస్తరణకు చర్యలు తీసుకుంటామని, ఆప్కాబ్ బోర్డ్ మీటింగ్ లో చర్చించి, సాధ్యమైనంత సహకారం అందించే దిశగా కృషి చేస్తామని ప్రకటించారు. నాబార్డ్ వైపు నుంచి అందించగలిగే మద్దతు, సహాయంపై కూడా ఆ సంస్థ అధికారులతోనూ చర్చిస్తామని తెలిపారు. రాబోయే తరాల మనస్సుల్లో సహకార భావజాలం నిలిచిపోయేలా పత్రిక చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ ఎడిటర్ అక్బర్ పాషా, న్యూస్ బ్యూరో చీఫ్ కృష్ణ, పత్రిక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పత్రిక డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి రావాలని సూచిస్తూ, వెబ్ సైట్ రూపకల్పన కోసం రూ. 50 వేలు, పత్రిక కార్యాలయం నిర్వహణకు మరో 10 వేల రూపాయలను వ్యక్తిగత విరాళంగా చైర్‌పర్సన్ గన్ని అక్కడికక్కడే అందజేశారు.

**డిజిటలైజేషన్‌కు సాంకేతిక, ఆర్థిక సాయం: ఎండీ**

స్వప్రయోజనాలు ఆశించకుండా, జీతాల్లేకుండా, స్వచ్ఛంద సేవకుల్లా గొప్ప ఆశయం కోసం సహకారభూమి నిర్వాహకులు పనిచేయడం నిజమైన సహకార స్ఫూర్తి అని ఆప్కాబ్) మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి. రామకృష్ణ అన్నారు. అందరూ కలిసి ముందుకెళ్లడమనే బలమైన సందేశాన్నిస్తూ, సహకార సమాచారాన్ని అద్భుతంగా చేరవేస్తున్న సహకారభూమి పక్షపత్రిక మూడో సంవత్సర వేడుకల్లో భాగస్వామినవ్వడం తనకు సంతోషాన్నిస్తోందన్నారు. ఆప్కాబ్ నుంచి సహాయం అందించడంతో పాటు, నాబార్డ్‌ను కూడా అడుగుదామని తెలిపారు. వెబ్‌సైట్ కోసం రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కూడా ఎండీ రామకృష్ణ ప్రకటించారు.

**డిజిటల్ విస్తరణకు నాబార్డ్ సాంకేతిక సహకారం**

సహకారభూమి పత్రికను చదివి తాను ఎంతో సంతోషించానని, పరిమిత వనరులతోనూ సహకార రంగం కోసం ఇంత నాణ్యమైన పత్రికను తీసుకురావడం అభినందనీయమని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డిజిఎం) ఎం.ఎస్.ఆర్. చంద్ర మూర్తి ప్రశంసించారు. నేటి పరిస్థితుల్లో ముద్రణ వ్యయాలు పెరగడం, పత్రికలు చదివేవారు తగ్గిపోవడం, వాణిజ్య ప్రకటనల కొరత వంటి అనేక సవాళ్ల మధ్య సహకారభూమి తన ప్రస్థానాన్ని కొనసాగించడం అసాధారణమన్నారు. ఈ పరిస్థితుల్లో కేవలం తప్పనిసరిగా డిజిటల్ ఫార్మాట్ లోకి మారాలని, దీనికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని నాబార్డ్ అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఆప్కాబ్, నాబార్డ్ బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులుండాలి

లోతైన, పరిశోధనాత్మక కథనాలతో సహకార అభిమానుల ముందుకు రావడమే సహకారభూమి పత్రిక సాధించిన గొప్ప విజయం.. అని వెటరన్ జర్నలిస్ట్ వడ్లమూడి పద్మావతి ప్రశంసించారు. తృతీయ వార్షికోత్సవ సభకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాత్రికేయ విలువలను, సహకార రంగానికి ఈ పత్రిక అందిస్తున్న సేవలను విశ్లేషించారు. 'పత్రికొక్కటున్నా చాలు పదివేల సైన్యం అన్నారు పెద్దలు నార్ల వెంకటేశ్వరరావు. నేడు కుప్పలు తెప్పలుగా ఛానల్స్, పత్రికలు అందుబాటులో ఉన్నా ఎవరి కోసం, ఏ లక్ష్యంతో పనిచేస్తున్నాయో అందరికీ తెలిసిందే. వాటన్నింటికీ భిన్నంగా, సహకార రంగ గళాన్ని వినిపించేందుకే సహకారభూమి ఉద్భవించింద'ని చెప్పారు. వార్షికోత్సవ సభకు హాజరైన అతిథులను సీనియర్ జర్నలిస్టు చావా రవి వేదికపైకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో సహకారభూమి జర్నల్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, పత్రిక గౌరవ సంపాదకులు దాసరి కేశవులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, సీనియర్ సహకారవాదులు, జర్నలిస్టులు జి.వి. రంగారెడ్డి, కె. ప్రసాదరెడ్డి, పాటిబండ్ల నాగ శ్రీనివాస్, శిరందాసు నాగార్జున, టి.వి. నరసింహారావు, దుర్గరాజు స్వాతి, 'ఇఫ్కో' రవీంద్రనాథ్, బూరగడ్డ శ్రీనివాస్, సీతారామయ్య, ముదిగొండ శ్రీనివాసరావు, డి. రామారావు, వై. శ్రీనివాసరావు, ఎన్.వి. శ్రీనివాసరావు, శివప్రసాద్, సీనియర్ ఫొటో జర్నలిస్టులు వై.దయానంద్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# మీడియాకు నో ఎంట్రీ

సాధారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అధికారిక కార్యక్రమాలకు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాను పిలవడం రివాజు. ప్రత్యేకించి ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, సభలు, సమావేశాల సమయాల్లో మీడియాను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లాలో జరిగే ప్రతి అధికారిక కార్యక్రమానికి ఇదే రకమైన ఏర్పాటు ఉంటుంది.

గత ప్రభుత్వ హయాంలో ఈ విధానంలో కొంత మార్పు జరిగింది. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన సందర్భంగా సమాచార శాఖ లైవ్ లింకులు ఇవ్వడం ద్వారా వార్తల కవరేజి చేసేందుకు పరిమితమయ్యారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది మీడియా ఫ్రెండ్లీ ప్రభుత్వం కనుక పాత ప్రభుత్వ వైఖరికి తిలోదకాలిస్తారని భావించారు. కానీ అందుకు భిన్నంగా గత ప్రభుత్వం అనుసరించిన లైవ్ లింకుల వైఖరినే అనుసరించడం జర్నలిస్టులను ఆశ్చర్యచికితుల్ని చేస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టే కార్యక్రమాలకు మీడియా హాజరు కావలసిన అవసరం లేదని లైవ్ లింకులను అందుబాటులో ఉంచుతున్నాం కనుక వాటి ద్వారా సమాచార సేకరణ కొనసాగించుకోవాలని నేరుగా సమాచార శాఖ మీడియా సంస్థలకు తెలియజేస్తోంది. మరొక రకంగా చూస్తే అధికారిక కార్యక్రమాలకు మీడియాకు నో ఎంట్రీ చెప్పడం లాంటిదేనని భావించవచ్చు. దానికి తోడుగా సోషల్ మీడియా ప్రభావం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ అనుకూల వైఖరిని అనుసరించే సోషల్ మీడియా బృందాలను పలు సందర్భాలలో కవరేజీలకు ప్రత్యేకంగా ఆహ్వానించటం కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది. జర్నలిస్టుల వృత్తి విలువలకు సవాలు నిలిచే ఈ ధోరణి ముందు ముందు మరిన్ని సమస్యలను సృష్టించే అవకాశం ఉంది. మీడియా సంస్థల యాజమాన్యాలు జర్నలిస్టు సంఘాలు ఈ దిశగా ఆలోచన చేసి ప్రభుత్వం ముందు ఈ సమస్య పరిష్కారం దిశగా యోచన చేసేందుకు వీలైన ప్రతిపాదన పెట్టాల్సి ఉంటుంది.

# జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో రాయితీ

విశాఖ జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్స్.. కళాశాలల ఫీజులో యాభై శాతం రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్‌కు వినతి పత్రం సమర్పించాయి. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయనను కలుసుకుని జర్నలిస్టులకు సంబంధించిన వలు అంశాలను ప్రస్తావించారు.. 2014 నుంచి జర్నలిస్టుల



పిల్లలకు కొన్ని సందర్భాల్లో వందశాతం, మరికొన్నిసార్లు యాభై శాతం స్కూల్ ఫీజు రాయితీ ఇస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.. గత ఏడాది అప్పటి కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలించిన అనంతరం వెంటనే ఈ ఏడాదికి సంబంధించి కూడా అవసరమైన ప్రొసీడింగ్స్ జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే జర్నలిస్టులకు సంబంధించిన ఇళ్ల స్థలాలు సమస్యను కూడా వివరించగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆరోగ్య బీమాకు సంబంధించి తెల్లరేషన్ కార్డుదారులకు, వెటరన్ జర్నలిస్టులకు సిఎస్ఆర్ నిధులతో ప్రీమియం చెల్లిస్తామన్నారు. పెన్షన్ సదుపాయం, ప్రమాద బీమా పునరుద్ధరణ వంటి అంశాలను వినతి పత్రం ద్వారా కలెక్టర్‌కు తెలియజేశామని గంట్ల శ్రీనుబాబు చెప్పారు. జర్నలిస్టుల పిల్లల స్కూల్ ఫీజు రాయితీ ఉత్తర్వులు వెంటనే జిల్లా విద్యాశాఖ ద్వారా జారీకానున్నట్లు చెప్పారు. ఇతర సమస్యలు పరిష్కారానికి తమ యూనియన్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి శ్రీనివాస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రవికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, నగేష్, కృష్ణమూర్తి, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర్ ప్రసాద్, ఆనంద్, అరుణ్ భాస్కర్, రాజశేఖర్, చంద్రశేఖర్, సత్యనారాయణ, అప్పలనాయుడు, భాస్కర్, డిఎన్ఎస్ రెడ్డి, సతీష్, కృష్ణమూర్తి, రమేష్, గౌతమ్, వినయ్,, రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు కృతజ్ఞతలు**

విశాఖపట్నం జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలందరికి 50 శాతం పీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేరిట ఈ ఉత్తర్వులను విడుదల చేశారు. జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు స్కూలు ఫీజులో 50శాతం రాయితీ కల్పించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశాయి.

## 28 మందికిపైగా జర్నలిస్టుల ఫోన్లపై నిఘా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌తో పాటు తెలంగాణ జిల్లాలో పనిచేస్తున్న 28 మంది జర్నలిస్టుల ఫోన్లను పోలీస్‌లు ట్యాప్ చేశారు. అందులో కొందరి ఫోన్లు లీగల్ ఇంటర్‌సెప్ట్ కాగా మిగిలిన వారికి అనధికారికంగా హ్యాక్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

మావోయిస్టులు, టెర్రరిస్టుల సమాచారం కోసం లీగల్‌గా ట్యాప్ చేసిన వారిలో ద హిందూ పొలిటికల్ ఎడిటర్ ఆర్.రవికాంత్‌రెడ్డి సైతం ఉండడం గమనార్హం.

ఆయన ఇటీవల బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో విచారణకు హాజరయ్యారు. సుమారు గంటపాటు ఆయన విచారణ సాగింది. ఇప్పటికే పలువురు జర్నలిస్టులు విచారణకు హాజరుకాగా, త్వరలో మరికొందరికి పోలీస్ పిలుపురానుంది.

# జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాల పంపిణి




మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టుల పిల్లలకు ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ కన్వెన్షన్ హాల్‌లో నోటుపుస్తకాలు, జామెంట్రీ కిట్స్ పంపిణీ చేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా పుస్తకాలను అందజేశారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజెఎఫ్), ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబిజెఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారి కుటుంబాలకు అండగా ఉండడం తన బాధ్యత అన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వార్తల కోసం శ్రమించే మీడియా సోదరుల పిల్లల చదువులకు సాయం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున జర్నలిస్టుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ ఇచ్చే విధంగా సిఫారసు చేస్తానన్నారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు నగరవనాన్ని జర్నలిస్టులు సందర్శించాలని కోరారు. ప్రకృతి రమణీయమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందరూ ఆస్వాదించాలన్నారు. అమరావతికి మణిహారమైన ఈ ప్రాంతం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఏపీడబ్ల్యూజెఎఫ్, ఏపీబిజెఏ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఎప్పుడూ సానుకూలంగా స్పందిస్తారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, మీడియా సోదరులు, తదితరులు పాల్గొన్నారు.






శిథిలావస్థలో ఉన్న గుంటూరు ప్రెస్‌క్లబ్‌ను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు

# పుట్టపర్తి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులు అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపిడబ్ల్యూజేఏఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజేఏఫ్ అధ్యక్షుడు షఫీ, కార్యదర్శి రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీ గౌరవాధ్యక్షుడిగా రంగప్ప(అనంతభూమి) అధ్యక్షుడిగా చలపతి(6టివి), కార్యదర్శిగా టీ.సీ.గంగాధర్(సీమ వార్త), ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు(ప్రజాశక్తి), సహాయ కార్యదర్శులుగా కల్లూరి ప్రసాద్, బసప్ప(ప్రజాశక్తి), కోశాధికారిగా శ్రీరాములు (పుట్టపర్తి సమాచార్), కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు(గీతాంజలి), గంగాధర్ (స్వతంత్ర), అనార్, మోహన్ కుమార్




నాయుడు, నారాయణస్వామిలుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ విస్తృతంగా పోరాడుతోందన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల సంక్షేమంతో పాటు రక్షణ కూడా ఉండాలన్నారు. సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో ఫెడరేషన్ కమిటీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆ కమిటీలు పటిష్టంగా పనిచేస్తే స్థానికంగా జర్నలిస్టులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడం మరింత సులువుగా మారుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా అధికారులకు వినతిపత్రం అందజేశామని, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం చెల్లింపు అంశం కూడా కొందరితో మాట్లాడుతున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలంతో పాటు ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వారు హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదన్నారు. దీనిపై ఫెడరేషన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉంటాయని రామాంజినేయులు స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఫెడరేషన్ నాయకులు డా. ఆర్కే. సూర్య, సంతోష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, శివ రామ కృష్ణ, చక్రపాణి, బాబ్జాన్, రాజేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల పిల్లలకు బ్యాగులు పంపిణి




విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు అక్షర స్కూల్స్ సహకారంతో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం జూన్ 11న ఏలూరులో ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్టి జబీర్, వై.వి.హరీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కో ఆప్షన్ సభ్యులు పెద్దబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పార్థసారథి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా నిలిచే జర్నలిస్టుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు పోరాడుతామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు అక్షర స్కూల్స్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ద్వారా విద్యారంగానికి సహకరిస్తున్నందుకు అక్షర స్కూల్స్ చైర్మన్ సురేంద్రను, డైరెక్టర్ అర్చన చౌదరిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. “విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుంది అని జర్నలిస్ట్ పిల్లలకు ఇలాంటి సహకారం అందించడం అభినందనీయం'' అని కొనియాడారు.

ఫెడరేషన్ కృషిని కొనియాడారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, జర్నలిస్టులకు అనేక విధాలుగా సహకారం అందిస్తున్న ఫెడరేషన్, ఎపిబిజెఎల కృషిని ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో.ఏలూరు ప్రసారం అధ్యక్షులు డి వి రమణ, ఏపీ బీజేపీ అధ్యక్షులు పి నారాయణ, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, అక్రిడేషన్ కమిటీ మెంబర్ కళ్యాణ్, ఏపీడబ్ల్యుజేఎఫ్ నాయకులు మిల్టన్ ప్రతాప్, చేతలవాడ ప్రతాప్, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షులు జయరాం, సతీష్, వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా, జర్నలిస్టులు ప్రింట్ మీడియా జర్నలిస్టులు తదితర జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్కూల్ పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అక్షర స్కూల్స్ అందించిన స్కూల్ బ్యాగులను అందుకున్న జర్నలిస్ట్ పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు.



**గుంటూరు జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ సదుపాయం కల్పించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న గుంటూరు జిల్లా ఫెడరేషన్, ఎపిబిజెఎ ప్రతినిధులు**

# పాత్రికేయుల సంక్షేమానికి కృషి

సమాజానికి మంచి విజ్ఞానాన్ని అందించగలిగే శక్తి గురువుకు, జర్నలిస్టులకు మాత్రమే ఉన్నదని, అలాంటి పాత్రికేయుల సంక్షేమానికి పల్లె కుటుంబం ఎప్పుడూ కృషి చేస్తుందని బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు పల్లె కిషోర్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గురువులు, పాత్రికేయులే సమాజానికి మంచి విజ్ఞానాన్ని అందించగలరని అన్నారు. తన తండ్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డికి మంత్రిగా, రాజకీయ నాయకునిగా కంటే గురువుగా మంచి గుర్తింపు ఉన్నదని అన్నారు. అటువంటి గురువుకు కుమారుడిని కావడం తన కెంతో



సంతోషదాయకమన్నారు. ఇటీవలకాలంలో తల్లిదండ్రులు జీవికను కొనసాగించేందుకు ఎక్కువ సమయం కేటాయించడంతో పిల్లల కోసం సమయం కేటాయించలేకపోతున్నారని అన్నారు. పిల్లలు తమ సమయాన్ని ఎక్కువగా సెల్‌ఫోన్‌లతో కాలం గడుపుతున్నారని చెప్పారు. పిల్లలకు విజ్ఞానాన్ని పంచేందుకు పుస్తకాలు ఎంతగానో తోడ్పడతాని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు, విజ్ఞాన సముపార్జనకు పుస్తకాలు మంచి స్నేహితులుగా వ్యవహరిస్తాయని అందుకు తగిన విధంగా విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రాంత ప్రజల్లో పల్లె కుటుంబానికి మంచి పేరు రావడానికి మీడియా ఎంతగానో దోహదం చేసిందని, వారికి తామెంతో రుణపడి ఉన్నామని అన్నారు. జర్నలిస్టులకు అన్ని వేళలా అండదండగా నిలిచేందుకు తమ కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దాదాపు 350 మంది జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాలు, విద్యాసామాగ్రిని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైనవారికి విందు ఏర్పాట్లు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ఫెడరేషన్ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జగదీష్, సూర్య, కేశవ్, శ్రీరాములు, రవి, సుధాకర్, ఆనంద్, పివికెకె ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులు, వారి పిల్లలతో పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మీడియాతో దురుసు ప్రవర్తన సరికాదు

చీమకుర్తి మండలం రామప్ప రామతీర్థం సెంటర్లోని వి టి పి ఎస్ హాల్లో డిడిఎంఎస్ శివశంకర్ ఆధ్వర్యంలో క్వారీ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లాల్లో చోటుచేసుకుంటున్న క్వారీ ప్రమాదాల నేపథ్యంలో అన్ని గ్రానైట్ వారిలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. అయితే సమావేశంలో సమాచారం సేకరించేందుకు వెళ్లిన కొందరు మీడియా ప్రతినిధులపై పలువురు మేనేజర్లు దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం అందినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి సమాచారం అందజేయడంలో భాగంగా మీడియా ప్రతినిధులు ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై సమాచారం తెలుసుకునే హక్కు ఉందని వారిని అనుమతించకపోవడం లేదా భద్రత చర్యలపై ప్రశ్నించినందుకు దురుసుగా ప్రవర్తించడం సరైన విధానం కాదని మేనేజర్లకు సూచించారు. ఈ ఘటనపై డిడి శివశంకర్‌ను వివరణ కోరగా ఇది రహస్య సమావేశం కాదు సాధారణ సమావేశం ఏదో చిన్న అపార్థం జరిగి ఉండవచ్చు మీడియా ప్రతినిధుల పట్ల అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా క్వారీ యజమానులు మేనేజర్లకు తగిన సూచనలు చేస్తారని ఆయన తెలియజేశారు.



# అనంతపురం అర్బన్ కమిటీ ఎన్నిక

అనంతపురం నగరంలో జరిగిన జర్నలిస్టుల ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అనంతపురం అర్బన్ నియోజకవర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షఫీవుల్లా, రేపటి రామాంజనేయులు అతిథులుగా హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సివిఆర్ ఛానల్ టౌన్ రిపోర్టర్ కే కేశవ్, కార్యదర్శిగా అనంతవరల్డ్ ఎడిటర్ వి ఉపేంద్ర కుమార్, కోశాధికారిగా ఐ న్యూస్ రిపోర్టర్ చెరుకూరి అనిల్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రజాశక్తి రిపోర్టర్ కే తిమ్మప్ప, వైభవం కుమార్, సహాయ కార్యదర్శిగా ఐ న్యూస్ ప్రతినిధి కే రవీంద్రనాథ్, ఎన్ టీవీ రిపోర్టర్ రాజారెడ్డి బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులుగా న్యూ న్యూస్ 8 రిపోర్టర్ హరి రాయల్, ఏపీ 99 రిపోర్టర్ మోహన్, ప్రజాశక్తి రిపోర్టర్ బంచిలా నాయక్, 10 టీవీ స్టాఫ్ కెమెరామెన్ చంద్రమోహన్ రెడ్డి. 99 టీవీ రిపోర్టర్ ఓబుళపతి, మెట్రో రిపోర్టర్ నాగేంద్ర, సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాసరావు, 6టీవీ రిపోర్టర్ నాగరాజు, వార్త రిపోర్టర్ ఆనంద్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో 10టీవీ ప్రతినిధి జగదీష్, 6టీవీ ప్రతినిధి డాక్టర్ సూర్య, బిగ్ టీవీ జిల్లా ప్రతినిధి భరత్, అనంత వరల్డ్ డిస్ట్రిక్ట్ బ్యూరో బి బాలాంజనేయులుతో పాటు పలు టీవీ ఛానళ్లు, దిన, వార పత్రికల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బనగానపల్లెలో సభ్యత్వ నమోదు

**బ**నగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ జి .మద్దయ్య యాదవ్, బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్నలిస్టుల హక్కులు, రాయితీల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ బనగానపల్లె నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఆంధ్ర అక్షర రామచంద్రారెడ్డి, సూర్య నరసింహారెడ్డి, కార్యదర్శి షాషావలి, మండల గౌరవ అధ్యక్షులు ఎం రఘురామిరెడ్డి మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి బాల చెన్నయ్య ఉపాధ్యక్షులు నేను సైతం మధు కార్యదర్శి సూర్య రాజేష్, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వర్లు, వెంకట రాముడు, జర్నలిస్టులు టీవీ5 సుబ్బయ్య, ఆర్ టి వి ఓబులేసు, బాలయ్య, మనోహర్, కుమారస్వామి, ఈ. వెంకటరమణ గౌడ్, దస్తగిరి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



# హిందూపురం నియోజకవర్గ కమిటీ ఏర్పాటు



జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, భద్రతా చర్యల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీ ఉల్లా జిల్లా కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలే మార్గమని ప్రతి విలేకరి సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఏపీడబ్ల్యుఎఫ్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురావడంతో పాటు ఇప్పటికే ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నందున వారి భద్రత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు షఫీ ఉల్లా కార్యదర్శి రామాంజనేయులు నేతృత్వంలో హిందూపురం నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్టు కిష్టప్ప, అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం రమేష్, బి ఆంజనేయులు, కార్యదర్శిగా గంగప్ప, సహాయ కార్యదర్శిగా గిరీష్ కుమార్, చంద్రశేఖర్, కోశాధికారిగా కె అశోక్ కుమార్ లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శంకర్, కేశవకుమార్, చాంద్ పాషా, హనుమంత రెడ్డి, హరికృష్ణ, ప్రశాంత్, అల్లిపేట నాగరాజులను ఎన్నుకున్నారు. అదేవిధంగా చిలమత్తూరు మండల కమిటీని ప్రకటించారు.

**మడకశిర నియోజకవర్గ కమిటీ ఏర్పాటు**

శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏపీడబ్ల్యుజెఎఫ్ నియోజకవర్గ సమావేశం జరిగి కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షఫీవుల్లా, ఆర్ రామాంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మడకశిర నియోజకవర్గ గౌరవాధ్యక్షులుగా రామకృష్ణ, అధ్యక్షులుగా గుడ్డంపల్లి మంజునాథ్, ఉపాధ్యక్షులుగా జగన్నాథ్, కార్యదర్శిగా లక్ష్మీపతి, కోశాధికారిగా ఎస్వి రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా కే మంజునాథ్, జాయింట్ సెక్రటరీలుగా ఆర్ శ్యాంసుందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, తిమ్మప్ప, నగేష్, బీబీ నాగరాజు, లోకేష్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన రిపోర్టర్లు పాల్గొన్నారు.





# శింగనమల నియోజకవర్గ ఫెడరేషన్ కమిటి ఎన్నిక

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రేపటి రామాంజనేయులు అన్నారు. బుక్కరాయసముద్రంలో శింగనమల నియోజకవర్గం ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన జర్నలిస్టులంతా హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు, కార్యదర్శి షఫీ, రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ, రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రధాన ఛానళ్ల, ప్రధాన పత్రికల జర్నలిస్టులు యూనియన్‌లో భాగం కావడం సంతోషంగా ఉందని అన్నారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా ఫెడరేషన్ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌ని కలిసి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య, హెల్త్ ఇన్సూరెన్స్ ఉచితంగా అందించేలా వినతి పత్రం అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు డాక్టర్ సూర్య మాట్లాడుతూ జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యుల విద్య, వైద్యం కోసం ఫెడరేషన్ కృషి చేస్తుందని చెప్పారు. జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల తరహాలో పెన్షన్ సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, వీటితోపాటు కొన్ని లక్ష్యాలు పెట్టుకొని పని చేస్తున్నట్లుచెప్పారు.




మైలవరంలో జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

**నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పగడాల రవి, మురళీ కృష్ణ ఎన్నిక**

శింగనమల నియోజకవర్గం నూతన కమిటీని అధ్యక్షులు మినహా అన్ని స్థానాలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీ పడడంతో ఓటింగ్ ద్వారా అధ్యక్షులుగా పగడాల రవి (నేటి సూర్య) ఎంపికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్టీవీ కేశవ్ నాయుడు, కార్యదర్శిగా సి.మురళీకృష్ణ (భారత్ టుడే), కోశాధికారిగా బి.బాలరాజు (6టీవీ) ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి నారాయణస్వామి (వార్త), ఆదినారాయణ (సాక్షి), పెద్దన్న (ప్రజాశక్తి), వెంకటేశులు (ప్రైమ్ 9), జయ కుమార్ (10 టీవీ), దీ.నారాయణ స్వామి (అక్షర టైమ్), నగేష్ (ఆంధ్ర జ్యోతి), బాలరాజు (6టీవీ), జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్బిరెడ్డి (సాక్షి) ఎన్నికయ్యారు.

# జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వాలదే

సమాజ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే జర్నలిస్టుల ఆరోగ్య రక్షణ బాధ్యత ప్రభుత్వాలదేనని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యుడు, భీమిలి ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్టు అప్పలరాజు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఎన్నారై ఆస్పత్రిలో తక్షణమే సర్జరీ చేశారు. ప్రస్తుతం వైద్య సేవలు పొందుతున్న అప్పలరాజును భీమిలి లోని ఆయన నివాసంలో . ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు అప్పలరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గంట్ల శ్రీనుబాబు, వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అప్పలరాజు త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు.



జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అలాగే ప్రభుత్వాలు కూడా ప్రమాద బీమాను పునరుద్ధరించాలని తగిన ఆరోగ్య సంరక్షణ భద్రత కల్పించాలని కోరారు.. జర్నలిస్టులకు తన పరిధి మేరకు, అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ కార్యదర్శి కింతాడ మదన్ భీమిలి జర్నలిస్టు సంఘం నాయకులు పి రంగ ధామం.. మోహన్ రావు.. నగేష్ బాబు జర్నలిస్టు సంఘాల నాయకులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య

అనంతపురం జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచితంగా విద్య అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు విజ్ఞప్తి చేసింది ఈ మేరకు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు షఫీ వుల్ల రామాంజనేయులు నాయకులు అనిల్ కుమార్ రెడ్డి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలామంది జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితి సరిగా లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చాలీచాలని వేతనాలతో నెట్టుకోస్తున్న జర్నలిస్టుల పిల్లలను చదివించుకోవడం భారంగా ఉందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్ళు, కళాశాలల్లో అందించాలని కోరారు. గతంలోనూ దీన్ని కొంతవరకు జిల్లాలో అమలు చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే కొన్ని విద్యాసంస్థలు కలెక్టర్లను పట్టించుకోవడంలేదని తెలియజేశారు. వైద్యం కూడా భారంగా మారిందని ప్రభుత్వం కూడా జర్నలిస్టుకులకు అందిస్తున్న ఆరోగ్య భీమా పథకానికి అయ్యే ప్రీమియంను సిఎస్ఆర్ నిధులతో చెల్లించేందుకు తోడ్పాటు అందివ్వాలని కోరారు. ఈ రెండిటి పైన జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితోను ప్రైవేట్ విద్యా సంస్థల యూనియన్లతోనూ ఒక సమావేశం ఏర్పాటు చేసి ఉచిత విద్యా జర్నలిస్టుల కుటుంబాలకు అందివ్వాలని సూచిస్తామని హెల్త్ స్కీం ప్రీమియం చెల్లింపు అంశాన్ని కూడా పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని వారు తెలియజేశారు.



# రాప్తాడు నియోజకవర్గం కమిటీ ఎన్నిక

ఏపిడబ్ల్యుజెఎఫ్ రాప్తాడు నియోజకవర్గం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో జర్నలిస్టుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ ఉల్లా, రేపటి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరైయారు. నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి. వెంకటేశులు నూతన అధ్యక్షులుగా పి. కొండప్ప (అనంత భూమి), కార్యదర్శిగా ఆర్.గణేష్ (ఎన్‌టివి), కోశాధికారిగా ఆర్. రామకృష్ణ (లేపాక్షి టైమ్స్), ఉపాధ్యక్షులుగా నల్లప్ప (బిగ్‌టివీ), దస్తగిరి (మనం ), మహేష్ (రాజ్‌న్యూస్), సహాయ కార్యదర్శులుగా మురళీ మోహన్ రెడ్డి (సాక్షి), అశోక్ కుమార్ (సాక్షి), కమిటీ సభ్యులుగా శివశంకర్ (ఎన్టీవీ ) సమీర్ (మహా న్యూస్) వీర్రాజులు (ఆంధ్ర ప్రభ) వెంకటేశులు (ఐ న్యూస్) సమీర్ వలి (సాక్షి) ప్రజాపతి (వార్త) భాస్కర్ (వార్త) మురళీకృష్ణ (సూర్య) మురళి (ప్రజాశక్తి) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


# జర్నలిస్టు ఇల్లు తగులబెట్టిన దుండగులు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఏలూరు జిల్లా సభ్యులు,మెట్రో టివి స్టాఫ్ రిపోర్టర్, రుషిరావు ఇంటిని దుండగులు తగులబెట్టారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి పథకం ప్రకారం ఇంటికి నిప్పటించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం రామసింగవరం గ్రామంలో ఏలూరు మెట్రో టి వి స్టాఫ్ రిపోర్టర్ శిలారపు రుషి రావు గృహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇంటి కిటికీలు తలుపులు, పగలగొట్టారు, కక్షతో దుండగులు కావాలనే పథకం ప్రకారం ఇంటిని తగులబెట్టినట్టు తెలుస్తోంది. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జబీర్, హరీష్‌లు ఆ గ్రామానికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానిక పోలీసు అధికారులను కలిసి రుషీరావు ఇంటిని తగులబెట్టిన దోషులను వెంటనే పట్టుకోవాలని కోరారు.



# ఆర్డీటి డైరెక్టర్‌కు వినతి

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకునేందుకు అనంతపురం జిల్లా ఫెడరేషన్ చొరవతో ఆర్డీటి ప్రోగ్రాం డైరెక్టర్ వద్దకు ఆ కుటుంబాన్ని తీసుకువెళ్లి సహాయం కోరింది. ఇటీవల అనంతపురం జిల్లాలో మృతి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి రవికుమార్ కుటుంబ సభ్యులు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆర్డీటి ప్రోగ్రాం డైరెక్టర్ మంచు ఫెర్రర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ నలుగురు పిల్లలకు ఆర్డిటి ద్వారా ఉచిత విద్య అందించాలని కోరారు. ఈ ప్రతిపాదనపై ఆయన పరిశీలిస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుఎఫ్ నాయకులు సూర్య, జయప్రకాష్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



# కోడుమూరు నియోజకవర్గ కమిటీ ఎన్నిక

కోడుమూరు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, వృత్తి అభివృద్ధే లక్ష్యంగా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రజాశక్తి సీనియర్ రిపోర్టర్ లిఇంతియాజ్ బాషాను ఎంపిక చేయగా, అధ్యక్షుడిగా ఎన్‌టీవీ రిపోర్టర్ టి.రఘును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వెంకట్ (ప్రజాశక్తి), కార్యదర్శిగా హంపిరెడ్డి (సాక్షి), కోశాధికారిగా సి.గణేష్ (హెచ్‌ఎంటీవీ), సహాయ కార్యదర్శిగా జి.నాగరాజు (10టీవీ) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా యుగంధర్ (సాక్షి టీవీ), ఎస్.గిరిబాబు (ఐ న్యూస్), బి.వీరన్న (సుమన్ టీవీ), సి.శివ (99టీవీ), లక్ష్మన్న (ప్రజాశక్తి) లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కార్యక్రమం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, జిల్లా నాయకులు టీజీ ప్రసాద్, శివన్న, చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కమిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, వృత్తి గౌరవం కోసం సమిష్టిగా పనిచేస్తామని హామీ ఇచ్చింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు జర్నలిస్టులు, పజాప్రతినిధులు, మేధావులు శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టు పిల్లల ఫీజులో రాయితీకి వినతి



గుంటూరు జిల్లాలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీబీజేఏ, ఏపీడబ్ల్యూజేఎఫ్ గుంటూరు జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జెసికి వినతి పత్రం అందించారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఏపీబీజేఏ, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ కోరారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ నిర్ణయం అవసరమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోస్క సువర్ణ బాబు,కేశంశెట్టి. శ్రీనివాసు, గాజుల.బ్రహ్మం, కాటూరి.వంశీ, పునుగుబాటి నాగరాజు. ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల.సాయికుమార్, పులివర్తి. హరీష్, వేముల.ప్రసాద్, వేముల.రాజేష్, వై.ఆరుద్ర, జి.శ్రీనివాసరావు, ఏం.కిషోర్, కె.పుల్లారావు, షేక్ బాజీ, షేక్ కాలేషా, ఈ.రామకృష్ణ, ఈ.నరేంద్ర మొదలైన వారు పాల్గొన్నారు. ఈ అంశంపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకొని వెళ్లి జర్నలిస్టుల పిల్లల చదువుకు రాయితీ లభించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

## సీనియర్ జర్నలిస్టు గోపీ మృతి

ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపీ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. గోపీ ఆకస్మికంగా అనారోగ్యం పాలు కావడంతో వైద్యచికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యచికిత్స అందిస్తున్న సమయంలోనే ఆయన మరణించారు. ఆయన దాదాపు నలభై యేళ్లకు పైగా ఖమ్మం కేంద్రం నుంచి వివిధ పత్రికలకు, ఛానళ్లకు విలేకరిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన జనం సాక్షి దినపత్రిక బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



## జర్నలిస్టు రామ్‌కుమార్ మృతి

విశాఖపట్నం నుంచి వెలువడుతున్న జలయుజ్ఞం పక్ష పత్రిక ఎడిటర్ టివి రామ్‌కుమార్ మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అస్వస్థతులుగా ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నారాయణ్, జి.శ్రీనివాసరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## హిందూ సుబ్రహ్మణ్యం మృతి



ఉమ్మడి కర్నూలు జిల్లా హిందూ ఆంగ్ల దినపత్రిక బ్యూరో ఇన్‌చార్జిగా పని చేసిన ఎంవీ సుబ్రమణ్యం(65) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కర్నూలు జిల్లా నాయకులు బి.గోరంట్లప్ప, కర్నూలు జిల్లా కన్వీనర్ మద్దయ్య, కడప జిల్లా అధ్యక్షులు సి.చంద్రమోహన్‌రాజులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## సీనియర్ జర్నలిస్టు కొండేపూడి మృతి


అమలాపురం సీనియర్ పాత్రికేయులు, ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా పూర్వపు అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ మృతి చెందారు. కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన ప్రస్తుతం విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. చాలాకాలం అంధ్రభూమి స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతికి ఫెడరేషన్ కాకినాడ



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నవీన్‌రాజ్, ఎం.లక్ష్మణ్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

## మెట్రో టివి విలేకరి సూర్యప్రకాష్ మృతి

విశాఖపట్నంలో సుదీర్ఘకాలం నుంచి మెట్రో టివి రిపోర్టర్‌గా పనిచేస్తున్న సూర్యప్రకాష్ మృతి చెందారు. అందరితో కలిసి మెలిసి పనిచేసిన సూర్యప్రకాష్ మరణం జర్నలిస్టు మిత్రుల్లో విషాదాన్ని నింపింది. ఆయన మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.






ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ ఫంక్షన్ హాల్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్టుల పిల్లలకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతున్న దృశ్యం




విజయవాడలో సహకార భూమి పక్ష పత్రిక తృతీయ వార్షికోత్సవ సంచికను ఆప్కాబ్ చైర్‌పర్సన్ గన్ని వీరాంజనేయులు ఆవిష్కరించిన దృశ్యం



జర్నలిస్టుల పిల్లలకు రాయితీపై విద్యాసదుపాయం కల్పించాలని కోరుతూ కర్నూలు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

# రైతన్నకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

**'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'**

అన్నదాతకు ఏటా
**రూ.20,000ల**
ఆర్థిక సాయం

2025-26 సంవత్సరానికి
రైతుల ఖాతాల్లో
**రూ.8985.41 కోట్లు** జమ


రాష్ట్రంలోని
**46,85,838**
మంది రైతులకు లబ్ధి

రాష్ట్ర వాటా రూ.6560.18 కోట్లు, కేంద్ర వాటా రూ.2425.23 కోట్లు

గౌ|| భారత ప్రధాని
**శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో..**

గౌ|| ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
**శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిచే**

**అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో భాగంగా**
**మూడో విడత కింద రూ.6,000లు జమ**



అన్నదాత సుఖీభవ పథకం - రైతన్నకు వరం